క్లుప్తంగా

సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోండి

పీలేరు : వివిధ కార్పొరేషన్ల ద్వారా అందించే సబ్సిడీ రుణాలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముస్లిం మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ అభ్యర్థులు సబ్సిడీ రుణాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. యూనియన్ బ్యాంక్ 14, ఇండియన్ బ్యాంక్ 8, బ్యాంక్ ఆఫ్ బరోడా 13, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ 13, దొడ్డిపల్లె గ్రామీణ బ్యాంక్ 12, తలపుల గ్రామీణ బ్యాంక్ 13, స్టేట్ బ్యాంక్ 13 యూనిట్లు కేటాయించినట్లు తెలిపారు. మొత్తం 86 యూనిట్లకు దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు.

రామసముద్రంకు చేరిన పాఠ్యపుస్తకాలు



ఎమ్మార్సీకి చేరిన పాఠ్యపుస్తకాలు

రామసముద్రం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు 2025–2026 విద్యా సంవత్సరానికి గాను అవసరమైన పాఠ్యపుస్తకాలు అందినట్లు ఎంఈవో–2 ఆంజనేయులు శనివారం తెలిపారు. 1వ తరగతి నుంచి 10 వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అవసరమైన 18,480 పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు చెప్పారు. పుస్తకాలను పాఠశాల తరగతులు ప్రారంభం కాగానే ఆయా పాఠశాలల హెచ్‌ఎంలచేత విద్యార్థులకు పంపిణీ చేయిస్తామన్నారు. అలాగే విద్యార్థులకు అవసరమైన నోటు పుస్తకాలు రావాల్సి ఉందన్నారు.

ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

పెద్దతిప్పసముద్రం: మోడల్ స్కూల్లో ఆరవ తరగతి ప్రవేశం కోసం గత నెల 21న నిర్వహించిన పరీక్షలకు సంబంధించి ఫలితాలు విడుదలయ్యాయి. పరీక్షలు రాసిన 73 మంది కూడా ప్రవేశాలకు ఎంపికై నట్లు ఎంఈఓ టూ గౌస్‌పీర్, ప్రిన్సిపాల్ శివకుమారి శనివారం పేర్కొన్నారు.

ఇన్‌చార్జి ఆర్ఐగా చినపరెడ్డి

పెద్దతిప్పసముద్రం: మండల ఇన్‌చార్జి రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ (ఆర్ఐ)గా సీనియర్ అసిస్టెంట్ చినపరెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించినట్లు తహసీల్దార్ శ్రీరాములు నాయక్ శనివారం పేర్కొన్నారు. ఇన్నాళ్లూ ఇక్కడ ఆర్ఐగా పని చేసిన బాలాజీ రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా పదోన్నతిపై మదనపల్లికి బదిలీపై వెళ్లారు.

శ్రీ లక్ష్మి నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో స్వామి

మదనపల్లె సిటీ: మండలంలోని సీటీఎంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శనివారం ధ్వజారోహణ నిర్వహించారు. ఆలయ అర్చకులు రుషికేశవ గరుడపతాన్ని ఆవిష్కరించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తీగెల వారి ఆధ్వర్యంలో స్వామిని గరుడ సేవపై ఊరేగించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

కంపోస్ట్ యార్డు పరిశీలన



కంపోస్ట్ యార్డును పరిశీలిస్తున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ జేడీ భాగ్యలక్ష్మి

మదనపల్లె : పట్టణంలోని మున్సిపల్ కంపోస్ట్ యార్డును శనివారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ జాయింట్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలతో కలిసి బైపాస్‌రోడ్డులోని కంపోస్ట్‌యార్డును తనిఖీ చేశారు. నిర్వాహకులు బ్లూప్లానెట్ సొల్యూషన్స్ సిబ్బంది నుంచి, ప్రతిరోజు పట్టణంలో సేకరిస్తున్న చెత్త, అందులో నుంచి తయారీ అవుతున్న కంపోస్ట్, మార్కెటింగ్ తదితర వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి పూజలు

రాయచోటి టౌన్: భద్రకాళీ సమేత వీరభద్ర స్వామికి పీఠాధిపతి పగడాల లక్ష్మీపతి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఈవో డీవీ.రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు లక్ష్మీపతి స్వామికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామి, అమ్మవారికి పూజలు చేశారు.

ఆటలు..బంగారు భవితకు బాటలు



హాకీ క్రీడ నేర్చుకుంటున్న పిల్లలు



అబాకస్ నేర్చుకుంటున్న చిన్నారులు



నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులు

- చిన్నారులకు తీర్చిదిద్దాల్సిన సమయం ఇది
- వేసవి సెలవులను సద్వినియోగించుకోవాలి

మదనపల్లె సిటీ: పాఠశాలలకూ వేసవి సెలవులు వచ్చేశాయి. సమయం దొరికితే చాలు విద్యార్థులు సెల్‌ఫోన్లు, టీవీలకు అతక్కపోకుండా కొత్త నైపుణ్యాలను నేర్చుకునేందుకు, మెదడుకు పదును పెట్టేందుకు సెలవు రోజుల్లో కాలాన్ని సద్వినియోగం చేసుకుంటే బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు. బంధాలు, అనుబంధాల విలువ తెలుసుకునేందుకు, జీవితాలను మార్చే పుస్తకాలను చదివేందుకు, జ్ఞాన సముపార్జన దినపత్రికల పఠనాన్ని అలవాటుగా మార్చుకునేందుకు వేసవి సెలవులు ఉపకరిస్తాయని స్పష్టం చేస్తున్నారు.

అత్యంత కీలకమైన సమయం

పదో తరగతి పూర్తయిన విద్యార్థులకు సెలవు రోజులు అత్యంత కీలకమైన సమయం. లక్ష్యం వైపు తొలి అడుగు వేసేందుకు కసరత్తు మొదలు పెట్టాలి. ఇంటర్‌లో ఏ కోర్సు తీసుకోవాలి, లక్ష్యం వైపు పయనించేందుకు ఎలాంటి కళాశాలలను ఎంచుకోవాలనే అంశాలను శోధించాలి. ఇంటర్ పూర్తయిన విద్యార్థులు మరింత జాగరూకతతో వ్యవహరించాలి. తదుపరి ఏ కోర్సు చదివితే ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయి, లక్ష్యం దిశగా అడుగులు సజావుగా పడాలంటే ఎలాంటి నైపుణ్యాలను అలవర్చుకోవాలి అనే వాటిపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలి.

బంధాలు,అనుబంధాలను ఆస్వాదిద్దాం

నిత్యం నిద్రలేవగానే కాలంతో పాటు కుటుంబమంతా పరుగులెత్తాల్సిన పరిస్థితులు దాపురించాయి. ఆప్యాయత, అనురాగాలు, బంధాలు,అనుబంధాలకు తావే లేకుండా పోయింది. వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు తమ పిల్లలకు బంధాలు,అనుబంధాల గొప్పదనం గురించి తెలియజేయాలి.

హెల్త్ ఫిట్‌నెస్

క్రీడల్లో ప్రవేశం లేకపోవడం, చదువుల ఒత్తిడిలో బాల్యం చిత్తువుతోందని ఎడ్యుకేర్ సంస్థ ఇటీవల సర్వేలో తేల్చింది. 6–12 ఏళ్ల లోపు బాల,బాలికలకు సైక్లింగ్, జంపింగ్, బాస్కెట్‌బాల్, 13 నుంచి 17 ఏళ్ల లోపు వారికి స్విమ్మింగ్, స్కేటింగ్,రన్నింగ్, జంపింగ్, షూటింగ్ మంచివి.

సరికొత్తగా...

పిల్లలు స్మార్ట్‌ఫోన్లకు అలవాటు పడ్డారు. అదికాదంటే కంప్యూటర్ ఎదుట గంటల తరబడి కూర్చుంటున్నారు. వేసవి సెలవుల నేపథ్యంలో అదే ధ్యాసలో ఉంటున్నారు. ఇలాంటి చిన్నారులకు అయిదు నిమిషాల నిడివిలో చేసే వివిధ రకాల వస్తువుల గురించి అవగాహన కల్పిస్తే బాగుంటుంది. ఇంటర్‌నెట్‌లో ఫైవ్‌మినిట్స్ క్రాఫ్ట్స్ అని టైప్ చేస్తే మనకు కావాల్సినవి ప్రత్యక్షమవుతాయి. గిఫ్ట్‌ల తయారీ, పూల బోకేలు, ఫోటో ఫ్రేమ్‌ల తయారీ, చిత్రలేఖనం, బుట్టల అల్లడం వంటి అంశాలు ఉంటాయి. రోజుకు ఒకటి నేర్పినా.. వారిలో కొత్త ఆలోచనలు పెంపొందుతాయి.

నృత్యం నేర్పిద్దాం

భరతనాట్యం, సంగీతంలో పిల్లలకు శిక్షణ ఇప్పిస్తే భిన్న రీతులపై అవగాహన పెరుగుతుంది. జిల్లాలో పలు సంగీత శిక్షణాలయాలు ఉన్నాయి. మంచి శిక్షకులకు ఎంపిక చేసుకుని, శిక్షణ ఇప్పిస్తే వారిలో సృజన మరింత పెరుగుపడుతుంది.

కొండలు ఎక్కిద్దాం

పర్వతారోహణ పిల్లలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని మానసిక వైద్య నిపుణులు,వ్యాయామ ఉపాధ్యాయులు చెబుతున్నారు. పిల్లల్లో ఆత్మ విశ్వాసం పెంపునకూ..పర్యావరణ ప్రేమికులుగా మారేందుకు దోహదపడుతుంది. మదనపల్లెలో వెల్ విషర్స్ ట్రెకర్స్ ప్రతి వారం కొండల్లో విహరిస్తున్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

మే ఒకటో తేదీ నుంచి జిల్లాలో వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తున్నారు.దీంతో పాటు ఆయా శాఖ గ్రంథాలయల్లో కూడా వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నారు.

ఆటల్లో శిక్షణ ఇప్పించాలి



నేటి పిల్లలు, యువతకు కష్టసుఖాల విలువ తెలియటం లేదు. బంధాలు, కుటుంబా బాంధవ్యాలపై కనీస అవగాహన లేకుండా పోతుంది. అందుకే తల్లిదండ్రులు ఈ అంశాలపై దృష్టి సారించాలి. పిల్లలను అమ్మమ్మ, నానమ్మల ఇళ్లకు తీసుకెళ్లి కొన్నాళ్ల పాటు వారితో ఉండేలా చూడాలి. పిల్లలు చెడు వ్యసనాల బారినపడకుండా వారి కదలికలపై ఓ కన్నేసి ఉంచాలి. ఆసక్తి ఉన్న ఆటల్లో శిక్షణ ఇప్పించాలి. ఆహ్లాదకరమైన ప్రదేశాలు, పర్యాటక ప్రాంతాల్లో పిల్లలతో కలిసి విహరించటం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవచ్చు.

–చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

నేటి నుంచి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాలు

మదనపల్లె సిటీ: స్థానిక కదిరిరోడ్డులోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆదివారం నుంచి ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షులు లక్ష్మీనారాయణాచారి, నవయుగ స్వర్ణకార సంఘం అధ్యక్షులు అప్పినపల్లి భాస్కరాచారి తెలిపారు. 332 ఆరాధన మహోత్సవాలు 8వతేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 4న ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, స్వస్తివాచకం, అంకురార్పణ, ధ్వజారోహణం, 5వతేదీన సుప్రభాత సేవ, కలశారాధన, నవగ్రహ హోమం చేపట్టనున్నట్లు తెలిపారు. 6వతేదీన కలశారాధన, నాగేవతామూర్తులకు పంచామృతాభిషేకం, షోడశోపచారపూజ, 7వతేదీన వీరబ్రహ్మేంద స్వామికి పంచామృతాభిషేకం, ఆరాధాన మహోత్సవాలు నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ, 8వతేదీన కలశ ఉద్వాసన, ధ్వజ అవరోహణ, మహా మంగళహారతి జరుగుతుందన్నారు. ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. భక్తుల దర్శనం కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక అలంకరణలో వీరబ్రహ్మేందస్వామి

పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే అర్హత లేదు

- శ్రీరామ్ చినబాబు నోరు అదుపులో పెట్టుకోవాలి
- పదవుల కోసం ఏది పడితే అది వాగితే ఊరుకునేది లేదు
- కూటమిపాలనలో పచ్చని పల్లెల్లో గంజాయి విక్రయాలు
- రెడ్‌బుక్ కేసులకు భయపడే ప్రసక్తే లేదు
- తంబళ్లపల్లె వైఎస్సార్ సీపీ నాయకులు



మాట్లాడుతున్న తంబళ్లపల్లె వైఎస్సార్ సీపీ నాయకులు

మదనపల్లె : టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు...నోరు అదుపులో పెట్టుకోవాలని, పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే స్థాయి, అర్హత రెండూ లేవన్న విషయం గుర్తుంచుకొని మసలుకోవాలని తంబళ్లపల్లె వైఎస్సార్ సీపీ నాయకులు హితవు పలికారు. శనివారం మదనపల్లె ఎంపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ...రెండురోజుల క్రితం తంబళ్లపల్లెలో రెండు బ్యాచ్‌ల మధ్య ఆధిపత్యపోరులో భాగంగా జరిగిన ఘర్షణలో బాధితులను పరామర్శిస్తూ...శ్రీరామ్ చినబాబు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జరిగిన ఘటన గురించి పూర్వాపరాలు తెలుసుకోకుండా మాట్లాడటం తగదన్నారు. సంఘటనతో ఎలాంటి సంబంధం లేని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిలను బాధ్యులుగా పేర్కొంటూ గంజాయి బ్యాచ్ అంటూ ఏవేవో మాట్లాడితే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. కనీసం వార్డు మెంబర్‌గా కూడా గెలవని నీవు...మాజీ ముఖ్యమంత్రిపై గెలిచిన ఎంపీ మిథున్‌రెడ్డిని, మంత్రిగా పనిచేసిన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని, వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డిని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శిస్తే...పదవులు వస్తాయనే ఆశతో...స్థాయి, అర్హత మరిచి విమర్శలు చేస్తే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. నీకు దమ్ముంటే... ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిని కాదు...నీ ఇంటి ముందే వెళుతున్న తంబళ్లపల్లె వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకోవాలని సవాల్ విసిరారు.

రెడ్‌బుక్ కేసులకు భయపడం

రెడ్‌బుక్ కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. కూటమిప్రభుత్వం పదినెలల పాలనలో పచ్చని పల్లెల్లో ఎక్కడ చూసినా గంజాయి విక్రయాలు ఎక్కువయ్యాయని, వాటిని అరికట్టలేక, ఎవరో ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘటనను రాజకీయంగా వాడుకోవాలని చూస్తే ప్రజలు హర్షించరన్నారు. తంబళ్లపల్లె అభివృద్ధిలో ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి కృషి ఎనలేనిదన్నారు.

టీడీపీ నాయకులకు చేతనైతే, ఆయన కంటే ఎక్కువగా అభివృద్ధి చేసి ప్రజలకు మేలు చేయాలన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చి పదినెలలవుతున్నా, పదవి రాలేదన్న నైరాశ్యంలో నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడన్నారు. గతంలో బోగస్ సొసైటీల పేరుతో చేనేత కార్మికుల కష్టాన్ని దోచుకున్న నీచసంస్కృతి నీదని విమర్శించారు. సమావేశంలో ఎంపీపీలు పూర్ణచంద్రిక, సాయిలీల, బి.కొత్తకోట జెడ్పీటీసీ రామచంద్ర, ఎంపీటీసీ మహేష్, నాయకులు నారాయణరెడ్డి, ఆముదాల మధుసూధన్‌రెడ్డి, జయసింహారెడ్డి, నరేంద్రరెడ్డి, రెడ్డిశేఖర్, సాంబశివ, విశ్వనాథ్, ఉమామహేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించండి

– మున్సిపల్ కమిషనర్‌కు సమ్మె నోటీసు



మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు సమ్మె నోటీసు అందిస్తున్న మున్సిపల్ వర్కర్స్ నాయకులు

మదనపల్లె : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వర్రి సురేష్‌కుమార్, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి మస్తాన్‌లు డిమాండ్ చేశారు. మే 20న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సభ్యులు పాల్గొంటారని శనివారం మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీలకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు కనీసవేతనం రూ.35వేలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ లెక్కలు చెబుతున్నా అమలు జరగడం లేదన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కేంద్రంలో 8వ, రాష్ట్రంలో 12వ వేతనసంఘం ఏర్పాటుచేయాలన్నారు. ప్రైవేటీకరణ విధానాలు నిలుపుదల చేయాలన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్మికులకు ఇంజినీరింగ్, శానిటేషన్ తేడా లేకుండా కనీస వేతనం రూ.35వేలు ఇవ్వాలని, మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను తీసుకోవాలని, స్కూల్ స్వీపర్లు, వాచ్‌మన్‌లకు కనీసవేతనాలు ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్లతో సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికుల సమస్యలపై ఒకరోజు సమ్మె నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఇంద్రాణి, ట్రెజరర్ దేవేంద్ర, మదనపల్లె మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యక్షులు పృథ్వీరాజ్, సహాయకార్యదర్శి ముబారక్, ఏఐటీయూసీ టౌన్ కార్యదర్శి తిరుమలప్ప, శ్రీనివాసులు, ఉమారాణి, భాగ్యలక్ష్మి, రాధా, వంశీ, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మాజీ ఛైర్మన్ కన్నుమూత



ముజీబ్‌హుస్సేన్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి

మదనపల్లె : మున్సిపల్ మాజీ ఛైర్మన్ గుండ్లూరు ముజీబ్‌హుస్సేన్(68) శనివారం తెల్లవారుజామున అనారోగ్యంతో కన్ను మూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇటీవల కోలుకున్నారు. అయితే శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం వేకువజామున తుదిశ్వాస విడిచారు. మదనపల్లె పట్టణంలో ముస్లిం సమాజానికి పెద్దదిక్కుగా, సీనియర్ పొలిటీషియన్‌గా పేరుమోసిన ముజీబ్‌హుస్సేన్ మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మహానేత, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి అనుచరుడిగా గుర్తింపు పొందడమే కాకుండా ఆయనతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. 1982–83లో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన కాంగ్రెస్‌పార్టీ తరపున కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయారు. 1987లో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌గా, 1994–1999లో మున్సిపల్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1996 జూన్ 14న మదనపల్లెలో వరదలు వచ్చిన సమయంలో సమర్థవంతంగా పనిచేసి పట్టణ అభివృద్ధికి విశేష కృషి చేశారు. 1999లో కాంగ్రెస్‌పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. మదనపల్లె నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు కేటాయించడం ముజీబ్‌హుస్సేన్‌తో ప్రారంభమైంది. ఈయనకు ఇద్దరు కూతుళ్లు. పెద్దకూతురు అమీనా షెహజా డాక్టర్. ఏపీఎండీసీ మాజీ ఛైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ అన్నమయ్యజిల్లా మహిళా అధ్యక్షురాలు జి.షమీమ్‌అస్లాం, నాయకులు రఫీక్‌అహ్మద్‌కు..ముజీబ్‌హుస్సేన్ వరుసకు చిన్నాన అవుతారు. ముజీబ్ హుస్సేన్ మరణవార్త తెలిసిన వెంటనే..పట్టణానికి చెందిన వివిధ రాజకీయపార్టీల ప్రముఖులు, మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు, ముస్లిం పెద్దలు,ప్రజలు పెద్దసంఖ్యలో ఆయన మృత దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్.దేశాయ్‌తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, కడప జెడ్పీ కోఆప్షన్ సభ్యులు రైల్వేకోడూరు వైఎస్.అన్వర్‌బాషా, టీడీపీ నాయకులు రాటకొండబాబురెడ్డి, శ్రీరామ్‌చినబాబు, జునైద్‌అక్బరీ, జనసేన నాయకులు గంగారపు రాందాస్‌చౌదరి, కాంగ్రెస్‌నాయకులు రెడ్డిసాహెబ్, సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు, తోపు కృష్ణప్ప, సాంబశివ, మురళీ, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, టీపీఓ జకీరా నివాళి అర్పించారు.

35 లీటర్ల సారా స్వాధీనం



సారా ఊటను పారబోస్తున్న పోలీసులు

పీలేరు రూరల్ : మండలంలోని వివిధ గామాల్లో దాడులు నిర్వహించి 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని జాండ్ల పంచాయతీ మర్రిమాకులపల్లె తాండాలో దాడులు నిర్వహించి నిర్మలబాయి వద్ద 10 లీటర్లు, సరోజమ్మ వద్ద 5 లీటర్లు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. అలాగే సూర్యానాయక్ తాండాలో దాడులు నిర్వహించి 20 లీటర్ల సారా, 65 కేజీల బెల్లం స్వాధీనం చేసుకుని 200 లీటర్ల ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఎం. రామదాసు నాయక్, మునిశంకరయ్యలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెద్దమండ్యంలో..

పెద్దమండ్యం: నాటుసారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్ట్ చేసినట్లు ములకలచెరువు ఎక్సైజ్ సీఐ మాధవి శనివారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పాపేపల్లె పంచాయతీ పి తురకపల్లెలో నాటుసారా విక్రయాలు చేస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన పెద్దఅమీర్ (52) నాటుసారా విక్రయిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. ఇతని వద్ద పదిలీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు ఆమె చెప్పారు. నాటుసారా తయారీ కోసం బెల్లం విక్రయించే వారిపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ఈ మేరకు కలిచెర్ల, పెద్దమండ్యం, తురకపల్లె ప్రాంతాలలో ఉన్న దుకాణదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాలలో నాటుసారా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ పివి రమణ, ఎక్సైజ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహుడికి పూజలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. శనివారం టీటీడీ వారి ఆధ్వర్యంలో వేకువజామునే స్వామివారికి పలు రకాల నైవేద్యాలు సమర్పించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. తోమాల సేవ, ఏకాంతసేవ కావించారు. ఈసందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకొన్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, ఆలయఅర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్రమాదకరంగా ఎన్‌హెచ్ 340 డ్రైనేజీలు



మగ్బీరా వద్ద మురుగునీటి కాలువలకు ఏర్పడిన రంధ్రాలు, వాహనాలు వెళ్లడంతో దెబ్బతిన కాలువ

గుర్రంకొండ: ఎన్‌హెచ్ 340 రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా గుర్రంకొండ నుంచి మగ్బీరా మీదుగా మార్కెట్‌యార్డు వరకు నిర్మించిన మురుగునీటి కాలువలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా గతంలో రోడ్డుకిరువైపులా మీటరు వెడల్పు, మీటరు లోతుతో కాలువలు నిర్మించారు. అయితే గుర్రంకొండ పట్టణంతో పాటు మగ్బీరా, మార్కెట్‌యార్డు వరకు కాలువలపై దుకాణాలు ఏర్పాటు చేసుకొన్నారు. కొన్నిచోట్ల అసలు అక్కడ కాలువలు ఉన్నట్లు ఆనవాళ్లు కూడా లేకుండా కాలువలు కబ్జా చేశారు. వ్యాపార, వాణిజ్య అవసరాల నిమిత్తం కాలువలను ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారం పగులగొట్టి తమ అవసరాల కోసం కొంతమంది వినియోగించుకొంటున్నారు.

మరికొన్ని చోట్ల నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోవడంతో వాహనాలు కాలువలపై వెళ్లడంతో కుప్పకూలి పలుచోట్ల దెబ్బతిని పోయాయి. ఇలా మురుగునీటి కాలువలపై పెద్ద ఎత్తున కాలువ పైకప్పులు కూలి శిథిలమైపోయి కాలువలు దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గాలివాన బీభత్సం.. నేల రాలిన మామిడి



పీలేరులో నేలరాలిన మామిడి కాయలు



దెబ్బతిన్న రేకుల షెడ్డు



రామసముద్రం మండలం పుంగనూరు మార్గంలో విరిగిపడిన నీలగిరి చెట్టు

పీలేరు : గాలివాన బీభత్సంతో మండలంలోని పలు గ్రామాల్లో మామిడి కాయలు నేల రాలాయి. శనివారం సాయంత్రం వీపరీతమైన గాలితో వర్షం కురిసింది. దీంతో మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో మామిడి కాయలు నేలరాలాయి. అలాగే వివిధ వృక్షాలు నేలకూలాయి. రమణారెడ్డి అనే రైతుకు చెందిన పశువుల రేకుల షెడ్డు దెబ్బతింది. అలాగే పాలీ హౌస్ పైకప్పు పూర్తిగా దెబ్బతింది. దీంతో రూ. 5 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు.

వడగండ్ల వర్షం

రామసముద్రం: మండలంలోని గుంతయంబాడి, వనగానిపల్లి , కుప్పనపల్లి, మిట్టాయంబాడు తదితర ప్రాంతాలలో శనివారం సాయంత్రం గాలి, వాన బీభత్సం సృష్టించింది. వడగండ్ల వర్షం పడటంతో రైతులు పండించి టమాటా, కొత్తిమిర, మిరప, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు నేలరాలాయి. పలు చోట్ల చెట్లు కొమ్మలు విరిగిపడ్డాయి. వనగానిపల్లి సమీపంలో నీలగిరి చెట్టు , తుమ్మ, వేప చెట్లు రోడ్డుపై విరిగిపడింది. దీంతో ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటలు దెబ్బతినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.